



# కరపత్రం

SINCE 2014

బుధవారం మార్చి 26 2025 | సంపుటి :0 | సంచిక : 163 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

## మంత్రి పదవిపై పలువురి ఆశావహుల ఆశలు
## మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని చర్చలు



ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహుర్తం దగ్గరపడింది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడింది. అయితే కేబినెట్‌లో రెండు బెర్త్‌లను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. పార్టీ బలోపేతంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్పు నినాదంతో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశవహులను ఊరిస్తూనే ఉంది. ప్రస్తుతం సీఎం సహా 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్‌లో మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండింగ్‌లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్టు చర్చజరుగుతోంది.ఆ లెక్కన మంత్రి పదవి దక్కనున్న ఆ నలుగురు ఎవరన్నది ఆసక్తికరంగా మారిందిప్పుడు. తరువాయి పేజి 2లో



# పోలీసుశాఖతో పెట్టుకోవద్దు

### కేటీఆర్‌ను హెచ్చరించిన రాజాసింగ్

ఏ పార్టీ అధికారంలో ఉంటే వారు చెప్పిన విధంగానే పోలీసులు వింటారని, పోలీసు శాఖతో పెట్టుకోవద్దని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశంతో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. ఏకంగా రేవంత్ రెడ్డి బెడ్‌రూమ్‌లోకి చొచ్చుకెళ్లి మరీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపారని అన్నారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడా.. ఆ సమయంలో తనను అరెస్ట్ చేసిన వారిని ఏమీ చేయలేదని తెలిపారు. కానీ 'మేము అధికారంలోకి వచ్చాక రిటైరైన పోలీసుల మీద కూడా చర్యలు తీసుకుంటాం' అని ఇప్పుడు కేటీఆర్ అంటున్నారని ఎవరు అధికారంలో ఉంటే వాళ్లు చెప్పిన విధంగా పోలీసులు లీగల్‌గానే పనిచేస్తారని... 2లో

# అర్ధరాత్రి బిర్యానీసెంటర్ పేలుడు

### ఘటనపై విచారణ చేస్తున్న పోలీసులు



నల్లగొండ, మార్చి25(ఆర్ఎన్ఎ): ఓ బిర్యానీ సెంటర్‌లో అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించడంతో చుట్టుపక్కలవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులోని పూజిత అపార్ట్మెంట్ ఎదురుగా ఉన్న హాట్ బకెట్ బిర్యానీ సెంటర్‌లో చోటుచేసుకుంది. పేలుడు ధాటికి షెటర్ గేటుతోసహా లోపల ఉన్న సామాన్లు రోడ్డుపై చెల్లా చెదురుగా పడ్డాయి. అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. 2లో



# ఎస్ఎల్‌బీసీ ఘటనలో మరో మృతదేహం లభ్యం

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో గత ఫిబ్రవరి 22న టన్నెల్ నందు ప్రమాదం జరుగగా ఎనిమిది మంది కార్మికులు, ఇంజనీర్లు, మిషన్ ఆపరేటర్లు చిక్కుకొని జలసమాధి అయ్యారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి పలు రెస్క్యూ టీంలు రేయింబవళ్లు వారి ఆచూకీం కోసం పనిచేస్తున్నాయి. 2లో

# ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలం?: సుప్రీంకోర్టు



2లో

# రైతుల జీవితాలతో చెలగాటలొద్దు.. సీఎం రేవంత్‌కు శ్రీనివాస్



**రైతుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వార్నింగ్ ఇచ్చారు.**

మహబూబ్‌నగర్ : రైతుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వార్నింగ్ ఇచ్చారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హన్వాడ మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామంలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.
ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రైతులకు ఇస్తామని చెప్పిన రైతు బంధు ఇవ్వండి.. రుణమాఫీ చేయండి.

# ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాలల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు.

2లో

# పోలీసు విచారణకు రీతుచౌదరి గైర్హాజరు

## కోర్టును ఆశ్రయించిన విష్ణుప్రియ




బెట్టింగ్ యాప్స్‌పై విచారణ కొనసాగుతుంది. ఈక్రమంలో బెట్టింగ్ యాప్స్ వ్యవహారానికి సంబంధించి తమ ఎదుట విచారణకు రావాలంటూ రీతూ చౌదరి, విష్ణుప్రియకు ఇప్పటికే పోలీసులు నోటీసులు ఇచ్చారు. గత గురువారం ఇద్దర్నీ కూడా పోలీసులు విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అలాగే మరోసారి విచారణకు రావాలని ఇద్దరికి సమాచారం ఇచ్చారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలంటూ చెప్పగా... ఇప్పటి వరకు విష్ణుప్రియ, రీతూ చౌదరి విచారణకు రాలేదు. ఓవైపు విచారణకు రావాలని పోలీసులు నోటీసులు ఇచ్చినప్పటికీ యాంకర్ విష్ణుప్రియ మాత్రం హైకోర్టులో పిటిషన్ వేశారు. తనపై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో బెట్టింగ్ వ్యవహారానికి సంబంధించి రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయని,

2లో

# సంపాదకీయం

## అభివృద్ధే దక్షిణాదికి శాపమైందనుకోవాలా?

ఏ దేశానికైనా రాష్ట్రాల సాధికారత చాలా ముఖ్యం. కేంద్రం కింద నలిగిపోకుండా, రాష్ట్రాల మధ్య సమానతను తెచ్చే వ్యవస్థనే సమాఖ్య అంటాము. సమాఖ్య వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తగినంత అధికారాలు, నిధులు సమకూర్చాల్సిన బాధ్యతను కలిగి ఉంటుంది. భారతదేశం కేంద్రీకృత సమాఖ్య రూపంతో పుట్టింది. దేశ సమైక్యతను, సమగ్రతను కాపాడడానికి రాష్ట్రాలన్నిటికీ కేంద్రం చేసిన చట్టాలకు లోబడి పనిచేయాల్సిన అవసరం కల్పించారు. కాలక్రమేణా 1980ల తర్వాత జాతీయ పార్టీల మీద అసంతృప్తితో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అవి వేగవంతమైన అభివృద్ధి కోసం తమదైన నమూనాలు తెచ్చాయి. దరిమిలా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో అభివృద్ధి వేగవంతమైంది. అభివృద్ధి పెరిగిన కొద్దీ ప్రభుత్వాల మీద ఇంకా బాధ్యత పెరుగుతుందని జర్మన్ ఆర్థికవేత్త అడాల్ఫ్ వాగ్నర్ చెప్పినట్టు, ప్రభుత్వాల బడ్జెట్లు కూడా పెరిగాయి. ఈ పరిస్థితిలో రాష్ట్రాలకు నిధుల కొరత సమస్యగా మారింది. ప్రధానంగా, సమాఖ్య నిబంధనల ప్రకారం, దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన పన్ను ఆదాయం దేశంలో ఉన్న వెనుకబడిన రాష్ట్రాలకు తరలిపోవడం వివాదాలకు కారణం అయింది.డిలిమిటేషన్ ప్రమాదం కూడా ముందుకు రావడంతో సమాఖ్య వివాదాలు ఇప్పుడు ప్రముఖంగా ముందుకొచ్చాయి. మొదటి యాభై ఏళ్ళు దేశంలోని మొత్తం రాబడిలో కేంద్రానికి 70శాతం, అన్ని రాష్ట్రాలకూ కలిపి కేవలం 30 శాతం నిధులు వెళ్ళే లాగా మొదటి 10 ఆర్థిక సంఘాలు నిర్ణయించాయి. అయితే, రాష్ట్రాలకు వినోదం, ఎక్సయిజ్, ప్రాపర్టీ, రిజిస్ట్రేషన్ పన్నులు లాంటి కొన్ని సొంత పన్నులు విధించుకునే అధికారం ఉండేది. ఇవి కాక కేంద్రానికి వెళ్లిన 70శాతం ఆదాయంలో, ఆర్థిక సంఘం నిర్ణయంతో కొన్ని నిధులూ, కేంద్రం తన ప్లానింగ్ కమిషన్ సూచనల ఆధారంగా కొన్ని నిధులు వెనక్కి వచ్చేవి. 1990ల్లో రాష్ట్రాలు ఈ 30 శాతం చాలట్లేదని పోట్లాడాయి. 25 ఏళ్ళ పోరాటం తర్వాత 14వ ఆర్థిక సంఘం దీన్ని 40 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇదిగో చేస్తున్నామని చెప్పింది. తీరా చూస్తే, ఆదాయ పన్నుల మీద, పెట్రోలు మీద 10శాతం సెస్సు, సర్‌చార్జి వాసులు చేసి, దాని వాటా మళ్ళీ 70 శాతానికి తెచ్చుకుంది. జీఎస్టీ విధానం వల్ల రాష్ట్రాలు సొంతంగా పన్నులు నిర్ణయించుకునే అధికారాన్ని కోల్పోయాయి.కేంద్రం ఉచ్చులో బిగుసుకున్నాయి. ఇది సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. దీని మీద 15వ సంఘం చేసిన సిఫార్సులు దక్షిణాది రాష్ట్రాలకు శరాఘాతం అయ్యాయి. ఈ సిఫార్సులు రాష్ట్రాల మధ్య నిధులను పంచే ప్రాతిపదికను మార్చాయి. జనాభా, విస్తీర్ణం, వెనుకబాటుతనం, పన్నుల రాబడి పెంచినందుకు ఇన్సెంటివ్, అటవీ భూమి శాతం దామాషాగా రాబడిని రాష్ట్రాలకు పంచుతారు. ఇందులో జనాభా లెక్కకు ప్రాతిపదికగా ఇదివరలో 1991 జనాభా లెక్కలు ఉండగా, దాన్ని 2021 జనాభా లెక్కలకి మార్చారు. దీనితో జనాభాని కంట్రోల్ చేసుకున్న దక్షిణాది రాష్ట్రాలకు భారీ కోత, జనాభా నియంత్రణని గాలికొదిలేసిన రాజస్థాన్, యూపీ, బీహార్, మధ్యప్రదేశ్ లకు విపరీతంగా నిధుల కేటాయింపు పెరిగింది. ఆయా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఉండడం వల్ల ఆశ్రిత రాష్ట్రాలకు లాభం చేకూరేలా ఇది చేస్తున్నారని దక్షిణాది రాష్ట్రాల ఆరోపణ. 24 ఉత్తరాది రాష్ట్రాలన్నీ కలిపి 64 శాతం పన్నుల రాబడిని జెనెరేట్ చేస్తే, కేవలం 5 దక్షిణాది రాష్ట్రాలు 36 శాతం పన్నులను సేకరిస్తున్నాయి. కానీ కేవలం 18.6 శాతాన్ని మాత్రమే దక్షిణాది రాష్ట్రాలకు తిరిగి ఇస్తున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు తాము ఇచ్చేదానికి సుమారుగా రెట్టింపు మొత్తాన్ని వెనక్కు పొందుతున్నాయి.ఇక్కడ పలు ప్రశ్నలు వస్తాయి: బలహీనమైన రాష్ట్రాలకు సహాయం చెయ్యడం బాగానే ఉన్నా, వాళ్ళు ఎన్నటికీ ఇదే బలహీనతను ప్రదర్శిస్తారా? ఈ సహాయం వల్ల వారిలో అలసత్వం పెరిగి అభివృద్ధి మీద దృష్టి పెట్టకుండా ఉంటున్నారా? ఈ సహాయానికి ఒక కాలపరిమితి అంటూ లేకపోతే, దక్షిణాది రాష్ట్రాల వాటా మీద ఆధారపడి బతకడం మనకు ఒక అలవాటు ఐపోదా? దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధి ద్వారా పెంచుకున్న పన్నుల రాబడిని ఉత్తరాది రాష్ట్రాలు తన్నుకుపోతే, ఇక్కడి ఆర్థిక ప్రగతి కుంటుపడదా? సమాఖ్య స్ఫూర్తి కోసం దక్షిణాది రాష్ట్రాలు ఎంత కాలమని ఎంత వరకూ త్యాగం చేయాలి? ఇదిగాక, గ్రాంట్ల కేటాయింపులో కూడా అన్యాయం జరుగుతోందని దక్షిణాది రాష్ట్రాల ఆరోపణ. ఇందులో వాస్తవం లేకపోలేదు. ఉదాహరణకు, ఆయుష్మాన్ భారత్ అనే కేంద్రం నిశ్చయించిన ఆరోగ్య బీమా పథకం కంటే ముందే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న బీమా పథకాలు ఎక్కువ కవరేజ్ కలిగి ఉన్నవి. కానీ, మా పాలసీ తీసుకుంటేనే ఈ గ్రాంటు ఇస్తామని కేంద్రం షరతుపెట్టింది. అది చెయ్యని పక్షాన తెలంగాణకి రూ.2 వేల కోట్లు తిరస్కరించారు. అలాగే జాతీయ విద్యా విధానం అమలు చెయ్యని కారణంగా తమిళనాడుకి సర్వశిక్ష అభియాన్ స్కీము కింద రూ.2.6 వేల కోట్లు నిరాకరించారు. షరతులతో కూడిన గ్రాంట్లు ఇవ్వడం, తిరస్కరించడం ద్వారా కేంద్రం సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించకుండా పెద్దన్నలా అధికారాన్ని రుద్దుతున్నది.అసలు ఈ సెంట్రల్ గ్రాంటులంటూ ఎందుకు, ఈ డబ్బంతా నేరుగా ఇచ్చేయమని రాష్ట్రాలు అడుగుతున్నాయి. ఆ విధంగా రాష్ట్రాల వాటా 50 శాతానికి పైగా పెంచవచ్చు. కానీ కేంద్ర ప్రభుత్వం అధిక రాబడిని చేతిలో పెట్టుకుని రాష్ట్రాల మీద పెత్తనం చెలాయిస్తోంది. సరే, ఇక పెరిగే ఖర్చులకు, రాబడి ఎపుడూ వెనుకబడే ఉండడం భారతదేశంలో రాజ్యానికి తప్పని పరిస్థితి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్రవ్య లోటుని, అప్పులని నియంత్రించే %ఖీ=దీవీ% చట్టాన్ని 2003లో తెచ్చారు. ఇందులో కేంద్రం తన సాలీనా ద్రవ్య లోటు 3 శాతంగా, రాష్ట్రాల లోటు 3 శాతంగా, బ్యాంకుల నుంచి తెచ్చుకునే అప్పు మీద పరిమితులను విధించారు. రాష్ట్రాలు రెవెన్యూ లోటును (అంటే, సొంత ఖర్చులకు సొంత ఆదాయానికి మధ్య లోటును) జీరోగా మెయింటైన్ చెయ్యాలని, మిగతా 3శాతం తన రాష్ట్ర ఆదాయంలో 3శాతం మించకుండా రిజర్వు బ్యాంకు అప్పు ఇచ్చే పద్ధతిని మొదలుపెట్టారు. రాష్ట్రాలు, ఈ పరిమితులని పాటించాయి కానీ కేంద్ర ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా ఉల్లంఘించింది. తను ఉల్లంఘిస్తూనే రాష్ట్రాలను మాత్రం కట్టడి చేస్తోంది. కేరళ, పంజాబ్, యూపీ, తమిళనాడు, బిహార్ లాంటి రాష్ట్రాలు రెవెన్యూ అప్పులు చేయకుండా ఉండలేకపోయాయి. తెలంగాణలోని బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ ప్రభుత్వాలు రెవెన్యూ లోటు జీరోగా చూపించి, ఏకంగా బడ్జెట్లో చూపని రహస్య అప్పులు విపరీతంగా చేశాయి. కేంద్రమైతే, పెట్రోల్ పన్నులోంచి ఈ ద్రవ్య లోటును తగ్గించుకుంది. మరి రాష్ట్రాలకు అలాంటి ఆధారం లేదు. కాబట్టి %ఖీ=దీవీ% పరిమితిని 4 శాతానికి పెంచమని అడుగుతున్నారు. ఇది సాధ్యమే అయినా, రెండు సమస్యలు ఉన్నాయి. అప్పుతెచ్చిన నిధులను సద్వినియోగం చేసుకున్నప్పుడే అది సమర్థనీయం. సంక్షేమ పథకాలకోసం తాహతుకి మించి అప్పు తెచ్చి ఇస్తే, కిస్తీలు కట్టలేని పరిస్థితి వస్తుంది. రీపేమెంట్ ఖర్చు ఇప్పటికే బడ్జెట్లో 35 శాతానికి చేరుకుంది. కాబట్టి, అప్పు పరిమితి పెంచితే రాష్ట్రాలు ఉద్యోగుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వస్తుందని ఒక వాదన. అప్పు తెచ్చుకోకపోతే అభివృద్ధి సాధించలేని పరిస్థితి మరొక వైపు.

## ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలం?: సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి
ఢిల్లీ: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదన్నారు. నోటీసు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడారని.. ఆ తర్వాత కూడా భారాసలోనే ఉన్నామంటున్నారని చెప్పారు.

“ఫిర్యాదులపై ఏం చేస్తారో.. 4 వారాల్లో షెడ్యూల్ చేయాలని కోర్టు ఆదేశించింది. అయినా పార్టీ మారిన వారికి స్పీకర్ నోటీసులు ఇవ్వలేదు. ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారు. 3 వారాల్లో రిప్లై ఇవ్వాలని.. ఫిబ్రవరి 13న స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికి 3 వారాలైంది.. నోటీసులు ఎటు వెళ్లాయో తెలియదు. మేము ఫిర్యాదు చేసి ఏడాదైనా స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదు” అని సుందరం తెలిపారు. ఈక్రమంలో స్పందించిన జడ్జి జస్టిస్ గవాయ్.. పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా అని వ్యాఖ్యానించారు.

ఇలాంటి వ్యవహారాల్లో రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు ఉన్నాయని జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పేర్కొంది. ఎప్పటిలోగా తేల్చాలనే విషయంలో గత తీర్పులు స్పష్టంగా చెప్పలేదని పేర్కొంది. అలాంటప్పుడు ఆ తీర్పును కాదని ఎలా ముందుకు వెళ్లగలమని చెప్పింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలమని ప్రశ్నించింది. పిటిషనర్ల వాదనలు ముగియడంతో విచారణను సుప్రీంకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

## రైతుల జీవితాలతో చెలగాటలొద్దు.. సీఎం రేవంత్‌కు శ్రీనివాస్

మొదటిపేజీ తరువాయి
వడగండ్ల వానతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.. వాటికీ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు నష్టపోకుండా మొలకెత్తినా వడ్లను కూడా కొనుగోలు చేశామని గుర్తు చేశారు. వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 40 వేల సహాయం అందించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

రైతు రుణమాఫీ అయిందని అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రులు క్షేత్ర స్థాయిలోకి వస్తే వాస్తవాలు తెలుస్తాయి. ప్రభుత్వం రైతుల పాలిట నిర్లక్ష్యం వహిస్తే మరో పోరాటానికి రైతులు సిద్ధమవుతారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తుంది. కాంగ్రెస్ అసమర్ధ పాలన వల్ల నీళ్లులేక పంటలు ఎండిపోతున్నాయి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. పంట నష్టపోయిన రైతుల వివరాలని ప్రభుత్వానికి పంపించాలి. మహబూబ్ నగర్ మండల పరిధిలోని చాలా గ్రామాల్లో పంట దెబ్బతిన్నదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారి వెంట మండల పార్టీ అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, రైతు కమిటీ అధ్యక్షులు కొండయ్య, సీనియర్ నాయకులు నెత్తికొప్పుల శ్రీను, చెన్నయ్య, జంబులయ్య, పెద్ద చెన్నయ్య, రాజుయాదవ్, అనంత రెడ్డి, బాలకిష్టయ్య, హరీష్ చందర్, వెంకన్న, మాధవులు, శ్రీనివాసులు, వెంకటయ్య, తిరుపతయ్య, బలవర్దన్, రామకృష్ణ ఉన్నారు.

## ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి
ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్లో చూసుకోవచ్చని సూచించారు.ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీల ఖరారుఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్ %–% ఈవినింగ్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## టీచర్ ఉద్యోగాల భర్తీపై మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్‌రావు కౌంటర్

హైదరాబాద్ : ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు.బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినం. 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఒక్కటి కూడా భర్తీ చేయలేదని శ్రీధర్ బాబు మాట్లాడడం సరికాదు. ఇక రెండో విషయానికి వస్తే.. ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సబితక్క అడిగితే.. 79 స్కూల్స్ తెరిపించామని బాగానే చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో మూతబడ్డ 1913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడరని అడుగుతున్నానని మంత్రి శ్రీధర్‌బాబును హరీశ్‌రావు ప్రశ్నించారు.

## మద్యం ఆదాయం ఎలా పెంచారో తెలుసు వేముల ప్రశ్నలకు మంత్రి జూపల్లి సమాధానం

: బెల్టు షాపులు పెంచిన ఘనత బిఆర్ఎస్ దేనని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంగళంవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకులపై మంత్రి జూపల్లి మండిపడ్డారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అడిగిన మద్యం అమ్మకాలపై ప్రశ్నకు జూపల్లి సమాధానం ఇస్తూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 2014లో రూ. 9,000 కోట్లు ఉన్న మద్యం ఆదాయాన్ని 2023 వరకు రూ. 34,000 కోట్లకు ఎలా పెంచిందో అందరికీ తెలుసన్నారు. చట్టవిరుద్ధంగా బెల్ట్ షాపులను పెంచి వాటి ద్వారా అక్రమంగా మద్యం అమ్మించారని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం స్మగ్లింగ్ ఆపడానికి దాడులు చేస్తోందని, ఫామ్ హౌస్‌లలో మద్యం తాగడాన్ని నిషేధించిందని సమాధానమిచ్చారు. ప్రశాంత్ రెడ్డి అడిగిన మరో ప్రశ్నకు రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమాధానం ఇస్తూ ఆర్‌ఆర్‌ఆర్ పనుల కోసం భూసేకరణ పనులకు అనుమతి వచ్చిందని, నిధుల విడుదలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని త్వరలోనే కలుస్తున్నామని చెప్పారు. విపక్ష నేతల నియోజకవర్గాల్లో రోడ్ల మరమ్మత్తుల కోసం నిధులు మంజూరు చేయడం లేదనేది అబద్ధం అని, హరీష్ రావు, కేటీ–ఆర్ నియోజకవర్గాల్లో రోడ్ల మరమ్మత్తుల కోసం, నూతన రోడ్లకు సరిపడా నిధులు కేటాయిస్తున్నామని వెంకటరెడ్డి సమాధానమిచ్చారు.

## తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి
సామాజిక సమీకరణాల ప్రకారం ఎస్టీ లంబాడకోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ తన ఆవాజ్ విన్పించడం సహా సీనియర్ నేత జానారెడ్డి అండదండలతో గట్టిగా ప్రయత్నాలు చేశారనేది టాక్.. అల్రెడీ నల్లగొండ జిల్లా నుంచి కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫిర్‌బీ తనకు చాన్స్ పక్కా అనే ధీమాతో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మరోవైపు వివేక్ వెంకటస్వామి, పెద్దల సభ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతికి అవకాశం వుండొచ్చనే ప్రచారం తెరపైకి రానే వచ్చింది. ప్రొఫెసర్ కోదండరామ్ పేరు కూడా పరిశీలనలో ఉందనే ప్రచారం జరిగింది. ఇక మంత్రి పదవి లేకపోవడం వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ తనకు కేబినెట్‌లో చోటివ్వాలని చెప్పకనే చెప్పారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి .తనకు చాన్స్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తానంటూ అలకాస్త్రం కూడా ప్రయోగించారు.. ఇక మైనార్టీ కోటా నుంచి కూడా కాంపిటేషన్ ఎక్కువగానే ఉంది. లైన్‌లో అలా ఎందరో ఆశవహులు ఉన్నారు. మరి వారిలో కేబినెట్ బెర్త్ చేజిక్కించుకునే ఆ నలుగురు ఎవరు? ఉగాది తెలంగాణ కేబినెట్ విస్తరణ ఖాయమనే సంకేతాలయితే వచ్చేశాయి. మరోవైపు ఏప్రిల్ 8,9న గుజరాత్‌లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం రణదీప్ సూర్జేవాల నేతృత్వంలో 15 మందితో కమిటీ నియమించారు. అందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు దక్కింది. మరి ఉగాది వేళ మంత్రిగిరికి సంబంధించి తీపి కబురు ఎవరికి? టఫ్ కాంపిటేషన్ నేపథ్యంలో రాజపూజ్యం–అవమానాలు..అసంతృప్తులు ఏ రేంజ్‌లో ఉంటాయోననే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ మొదలైంది.

## పోలీసు విచారణకు రీతుచౌదరి గైర్హాజరు

మొదటిపేజీ తరువాయి
ఈ రెండింటినీ క్వాష్ చేయాలంటూ హైకోర్టులో యాంకర్ పిటిషన్ వేశారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత విష్ణుప్రియ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో కోర్టు ఆదేశాల మేరకు విష్ణుప్రియ విషయంలో ముందుకు వెళ్లాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే యూట్యూబర్ రీతూ చౌదరిని కూడా విచారణకు రావాల్సిందిగా పంజాగుట్ట పోలీసులు స్పష్టం చేయగా.. ఇప్పటి వరకు కూడా ఆమె విచారణకు రాలేదు. గతంలో విచారణకు రావాలని నోటీసులు ఇచ్చినప్పుడు కూడా రీతూ చౌదరి మూడు గంటలకు హాజరయ్యారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని చెప్పినప్పటికీ రీతౌ చౌదరి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలో ఆమెకు మరోసారి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## పోలీసుశాఖతో పెట్టుకోవద్దు

మొదటిపేజీ తరువాయి
ఆ విషయం మర్చిపోయారా కేటీఆర్ అని ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలపై ఎన్నో కేసులు పెట్టి పోలీసులు జైలుకు పంపిస్తున్నారని... బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జ్‌కు చూశారన్నారు. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు కూడా పంపించారని రాజా సింగ్ గుర్తుచేశారు. అయితే ఇందులో షాకింగ్ విషయం ఏంటంటే.. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించే సమయంలో సొంత పార్టీ నేతలు, కొంతమంది బీజేపీ అధికారులు.. పోలీసులకు మద్దతుగా నిలిచారన్నారు. ఈ విషయాన్ని ఓ పోలీస్ అధికారే స్వయంగా తనతో చెప్పారన్నారు. అయితే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. తనను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులను, బీజేపీ అధికారులను ఏం చేయాలని ప్రశ్నించారు.

## ఎస్ఎల్‌బీసీ ఘటనలో మరో మృతదేహం లభ్యం

మొదటిపేజీ తరువాయి


ఈ క్రమంలోనే మరో కార్మికుడి మృతదేహం ఆచూకీ లభ్యమైనది. టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి టిబిఎం మిషన్ కింద కన్వేయర్ బెల్టు డ్రమ్‌కు 40 మీటర్ల దూరంలో మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. టన్నెల్ నందు మినీ జెసిపి ద్వారా శిథిలాలు తొలగించడం, మట్టి బురదను బయటకు పంపడం సహాయక చర్యలు కొనసాగుతుండగా శిథిలాల కింద మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. అట్టి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉండడం, ఆ ప్రదేశం భరించలేని దుర్వాసన వస్తుండడంతో మిగిలిన ఆరుగురి మృతదేహాలు కూడా అదే ప్రదేశంలో ఉండే అవకాశం ఉంటుందని అనుమానిస్తున్నారు. రెస్క్యూ బృందాలు దుర్వాసన వస్తుండడంతో స్ప్రే బాటిల్స్ తీసుకొని లోపలికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి టిబిఎం మిషన్ పరికరాలు గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించడం, మృతదేహం చుట్టూ భారీగా పేరుకుపోయిన శకలాలు, మట్టి బురద తొలగించడం లాంటి సహాయక చర్యలు వేగవంతం చేసి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్ కుమార్‌గా గుర్తించారు. అనంతరం డెడ్‌బాడీని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం డెడ్‌బాడీని మనోజ్ కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

## అర్ధరాత్రి బిర్యానీసెంటర్ పేలుడు

మొదటిపేజీ తరువాయి
పేలుడుకు గల కారణాలు తెలియరాలేదు. అయితే గ్యాస్ సిలిండర్ పేలిందా లేదా షార్ట్ సర్క్యూట్ అయ్యిందా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. రంజాన్ మాసం సందర్భంగా అర్ధరాత్రి వరకు షాప్ తెరిచే ఉన్నదని, షాప్ బంద్‌చేసిన 15 నిమిషాలకు ఈ పేలుడు జరిగినట్లు పోలీసులు తెలిపారు. గ్యాస్ సిలిండర్ అయితే ఏమీ పేలలేదని, మరేదైనా కుట్ర కోణం దాగి ఉందా అని పోలీసులు ఆరాతీస్తున్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళనలు.

# పొడుస్తున్న పొద్దు మీద కాంగ్రెస్ నిషేధాజ్ఞలు

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

గత వారం ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ జారీ చేసిన ఒక సర్క్యులర్ విభేదాలకు కేంద్రబిందువుగా మారింది. తెలంగాణలో మరో పోరాటానికి బీజం వేసింది. గత బి.ఆర్.ఎస్ పాలనలో, కేసీఆర్ ఆధ్వర్యంలో ధమననీతి రాజ్యం ఏలిందని కాంగ్రెస్ రోడ్డెక్కి గొడవలు చేసింది. కెసిఆర్ వెనుక నిలిచిన కమ్యూనిస్టు శక్తులు కూడా ఈ దమన నీతిని నిరసించాయి.బి ఆర్ ఎస్ వ్యతిరేక పోరాటానికి కాంగ్రెస్ తో చేతులు కలిపాయి.తెలంగాణ సాధన ఉద్యమానికి వెన్ను దన్నుగా నిలిచిన కమ్యూనిస్టులు,కమ్యూనిస్టు ప్రజా సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, విద్యావంతుల వేదికలు ఇలా అందరూ కలిసి తెలంగాణ సాధనకు పోరాడిన విషయం ఒక గతం. గత వైభవం చెప్పుకుంటూ బ్రతుకుతున్న అన్ని రకాల కమ్యూనిస్టులు తెలంగాణలో ప్రత్యేక రాష్ట్రం కొరకు కెసిఆర్ వెనకాల నిలబడి కలబడిన విషయము జగద్విదితము. తెలంగాణ సాధనకు సారథిగా కేసీఆర్ వెన్నంటే మొత్తం తెలంగాణ సమాజం నిలిచింది. తెలంగాణ రాష్ట్ర సమితి తో పాటు, భారతీయ జనతా పార్టీ, ఆ రోజుల్లో వెలసిన తెలంగాణ వాద పార్టీలు, కమ్యూనిస్టులు, కుల మత రహితంగా మొత్తం తెలంగాణ సమాజం తెలంగాణ సాధనకు ఒక్కటై నిలిచి పోరాడింది. తెలంగాణ సాధన తో కమ్యూనిస్టులు అతివాద కమ్యూనిస్టులు, నక్సలైట్లు తమ ప్రాబల్యాన్ని మళ్లీ సాధించాలని కేసీఆర్ వెనక ఒక చోదక శక్తిగా నిలుచుని భవిష్యత్తుపై ఆశలతో జీవించారు. గతంలోతెలంగాణ లో ఒకనాడు బలంగా ఉన్న నక్సలైట్ ఉద్యమాలు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో నక్సలైట్ కార్య కార్యకలాపాలకు ఒక కేంద్ర బిందువుగా మార్చాలని నక్సలైట్ శక్తులు ఈ తెలంగాణ ఉద్యమానికి వెన్ను దన్నుగా నిలిచాయి. నక్సలైట్ల సొంత ఎజెండా కెసిఆర్ కు చాలా ఉపయోగపడింది. మొత్తానికి తెలంగాణ ఏర్పడింది. అలాగే మొత్తంగా కమ్యూనిస్టుల ఆశలపై కేసీఆర్ ప్రభుత్వం నీళ్లు చల్లింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ తన సొంత ఎజెండాతో పాలన సాగించడం కొనసాగించాడు. కమ్యూనిస్టులు పోరాటానికి తప్ప పాలనకు పనికిరారు అన్న విషయము కెసిఆర్ కు స్పష్టంగా తెలుసు.పోరాటం వేరు పాలన వేరు అన్న విషయము కెసిఆర్ కు తెలిసినంతగా తెలంగాణలో ఇంకెవరికీ తెలియదు. పోరాట సమయంలో కమ్యూనిస్టులు వారి అనుబంధ సంస్థల సహకారం తీసుకున్న కేసిఆర్, మెల్ల మెల్లగా కమ్యూనిస్టులను ఒక పరిమిత జోన్ లో ఉంచేశాడు.తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చిన కేసీఆర్ తన ఆకాంక్షలను విస్తృతం చేసుకోవడానికి ముందుకెళ్లాడు.ఈ క్రమంలో కమ్యూనిస్టులను దూరం పెట్టాడు.తనకు అనుకూలంగా ఉన్న కొందరు కమ్యూనిస్టు మేధావులను, తనకు వంత పాడే కమ్యూనిస్టు వ్యక్తులను చేరదీశాడు.కొన్ని పదవులు, నామినేటెడ్ పోస్టులు తప్ప కమ్యూనిస్టులకు ప్రాధాన్యత లేకుండా చేశాడు.ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు అయిన ధర్నాలు ప్రదర్శనలు చేసుకోవడానికి ఇందిరాపార్క్ వద్ద ఉన్న ఒకే



ఒక్క ధర్నా చౌక్ ను కేసీఆర్ నిషేధించాడు.కెసిఆర్ కేవలం ధర్నా చౌక్ నే కాకుండా అన్ని చోట్ల ఉద్యమాలపై ఉక్కు పాదం మోపాడని దానివల్ల కమ్యూనిస్టులకు ప్రాణం వాయువు అందకుండా చేశాడని, కమ్యూనిస్టులు కేసీఆర్ కు దూరమయ్యారు.కెసిఆర్ రెండు పర్యాయాలు దాదాపు పది సంవత్సరాలు అప్రతిహతంగా తెలంగాణలో రాజ్యమేలాడు. ఈ పాలనా కాలంలో కమ్యూనిస్టులను నియంత్రించడమే కాకుండా వారి ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చాడు.

కెసిఆర్ నిర్లక్ష్య ధోరణి పట్ల కినుక వహించిన కమ్యూనిస్టులు ఏ రకంగా నైనా కెసిఆర్ ను గద్దె దించాలని అవకాశాల కోసం వెతకడం ప్రారంభించారు.అదేవిధంగా,కెసిఆర్ ప్రభుత్వం తెలంగాణలో సోషల్ మీడియా పై ఉక్కు పాదం మోపడం ప్రారంభించాడు. ఎంతోమంది జర్నలిస్టులను జైలుకు పంపించాడు. కెసిఆర్ అప్రజాస్వామిక వైఖరికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు మళ్లీ ఇంకో దారి వెతుక్కోవడం ప్రారంభించారు.ఆ సమయంలో బిజెపి కూడా తెలంగాణలో ఒక ప్రభలమైన శక్తిగా ఎదుగుతున్నది. రెండు పార్టీలను కాదని బిజెపి ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉందని కమ్యూనిస్టులు తమ బిజెపి వ్యతిరేక పనిని తీవ్రతరం చేశారు.బిజెపికి సహజ శత్రువులైన కమ్యూనిస్టులు, ఆగర్భ వ్యతిరేకులైన కమ్యూనిస్టులు కాంగ్రెస్ వైపు దృష్టి సారించారు.ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పాటు మాజీ నక్సలైట్లు, కమ్యూనిస్టు జర్నలిస్టులు ఇంకా ఇతర కమ్యూనిస్టు మేధావి వర్గాలు ఒక్కటై కేసీఆర్ తో పాటు బిజెపిని కూడా నిలువరించాలని కాంగ్రెస్ పంచన చేరారు.తెలంగాణలో కమ్యూనిస్టులకు ఒక కార్య క్షేత్రము లేదన్న విషయము వారికి స్పష్టంగా తెలుసు.కాబట్టి గద్దర్ ను ఒక విశేష శక్తిగా ఫోకస్ చేయడము చేశారు. గద్దర్ పై గల అభిమానాన్ని సొమ్ము చేసుకోవడానికి ఒక ప్రయత్నం ప్రారంభించారు.గద్దర్ ను రాహుల్ గాంధీతో కలిపి ఒక రహస్య కూటమిని ప్రారంభించారు.దానికి గాదె ఇన్నయ్య, పాశం యాదగిరి, హరగోపాల్ తో పాటు చాలామంది కమ్యూనిస్టు భావజాలం గల వర్గాన్ని కాంగ్రెస్ వెనకాల నడిపించడం ప్రారంభించారు. గాదె ఇన్నయ్య మూడు నెలలు ఢిల్లీలోనే మకాం వేసి తెలంగాణలో బిఆర్ఎస్, బిజెపి వ్యతిరేక శక్తులకు ఒక భూమికను వేదికను ప్రారంభించారు.తెలంగాణలో బిజెపిని అధికారంలోకి రానివ్వమని, అదే మా ఎజెండా అని కమ్యూనిస్టు నాయకత్వం బహిరంగంగా ప్రకటించిన విషయం అందరికీ తెలుసు.సిపిఐ, సిపిఎం పార్టీలతో పాటు చిన్నాచితక కమ్యూనిస్టు సంఘాలు అన్ని కాంగ్రెస్ సూచన మేరకు రేవంత్ రెడ్డి వెనకాల చేరిపోయారు. ఆ స్థితిలో తెలంగాణ రాజకీయము మూడు ప్రధాన శక్తుల మధ్యలో విభజించబడింది. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు సమానంగా ఎన్నికల రంగంలో దూసుకుపోతున్న సమయంలో ఉన్నట్టుండి బిజెపి వెనకడుగు వేసింది.కెసిఆర్ కుటుంబ పాలనను వారి అహంకారాన్ని వారి ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణిని ఏ రకంగానూ ఒప్పుకోలేని బిజెపి, రేవంత్ రెడ్డికి సైడ్ ఇచ్చింది. కమ్యూనిస్టుల వ్యూహాన్ని అర్థం చేసుకున్న బిజెపి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడడానికి దోహదపడింది.కానీ, ఇప్పుడు కథ మళ్లీ మొదటికొచ్చింది.కెసిఆర్ పాలన ప్రజాస్వామిక వైఖరికి విరుద్ధంగా ఉందని ప్రచారం చేసిన కమ్యూనిస్టులు, ఉద్యమాలు చేసిన ప్రజా సంఘాలు ఇప్పుడు మళ్లీ అవే ఉద్యమాలు మొదలుపెట్టారు. రేవంత్ రెడ్డి మొన్న అసెంబ్లీలో మాట్లాడుతూ జర్నలిస్టుల తోడుకలు తీస్తానని, మీడియాను తొక్కేస్తానని, అణచివేస్తానని, జర్నలిస్టులను జైల్లో వేస్తానని ప్రకటించడం మాట్లాడడం అన్ని రకాల ప్రజాస్వామ్య శక్తులకు ఒక హెచ్చరికగా మారింది. అన్నట్టే ఇద్దరు జర్నలిస్టులను రేవంత్ రెడ్డి ప్రభుత్వము జైలుకు పంపించింది. రేవంత్ రెడ్డి ధోరణిని వ్యతిరేకించే ప్రజాస్వామ్య శక్తులు కమ్యూనిస్టుల మౌన ధోరణి పట్ల విమర్శలు చేయడం ప్రారంభమైంది. తెలంగాణ విటల్ లాంటి ఉద్యమకారులు జర్నలిస్టులు ఈ సూడో కమ్యూనిస్టు మేధావులు రేవంత్ రెడ్డి ప్రభుత్వ ధోరణి పట్ల ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరి పట్ల బహిరంగ విమర్శలు చేయడం మనం చూసాము. కెసిఆర్ ను వ్యతిరేకించి, రేవంత్ రెడ్డిని తలపై మోస్తున్న కమ్యూనిస్టులకు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి వైఖరితో గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. ఇదిలా ఉండగా గత వారం ఉస్మానియా యూనివర్సిటీ పాలకవర్గము ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఈ సర్క్యులర్ లో ఆదేశించిన, సూచించిన ప్రకారము ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో ఎలాంటి ప్రదర్శనలు గాని ఎలాంటి ధర్నాలు గాని ఎలాంటి నినాదాలు గాని రోడ్లపై పాలన విభాగాల ముందు బైటాయింపులు గానీ ఎలాంటి రోడ్ జామ్ గానీ చేయడానికి వీలు లేదు అని ఆజ్ఞలు జారీ చేశారు. ఇకపై ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ పరిధిలో ఎలాంటి ప్లకార్డులు ప్రదర్శించడం గాని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందర జమ కూడడం గాని చేయకూడదు అని ఖచ్చితమైన నిర్దేశాలు చేశారు. దీనితో, ఇది కచ్చితంగా ప్రజాస్వామ్య వ్యతిరేకం చర్య అని అన్ని వర్గాల నుంచి విమర్శలు ప్రారంభమయ్యాయి.

గద్దర్ ను ఒక ఎరుపు దేవుడిగా ఫోకస్ చేసిన కమ్యూనిస్టు శక్తులకు ఈ సర్క్యులర్ తో వారి ప్రాణవాయువు తీసివేసినట్టుగా అయిపోయింది పరిస్థితి.దీనితో నిన్న సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఒక సమావేశము ఏర్పాటు చేసుకున్న శక్తులు అందరూ శోకరాగాలు ఆలపించడం మనం చూశాం. ప్రొఫెసర్ హరగోపాల్, పాశం యాదగిరి, గాదె ఇన్నయ్య లాంటివాళ్ళు రేవంత్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడం మీరు గమనించే ఉంటారు. ఉస్మానియా సర్క్యులర్ ను బిజెపి నాయకులు, బి ఆర్ ఎస్ నాయకులతోపాటు ప్రజాస్వామ్య ప్రియులు అందరూ ముక్తకంఠంతో ఈ సర్క్యులర్ ను వ్యతిరేకిస్తున్న విషయాన్ని మనం చూస్తున్నాము.బిజెపి కేంద్రమంత్రి శ్రీ కిషన్ రెడ్డి ఈ సర్క్యులర్ ను తీవ్రంగా వ్యతిరేకించాడు. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ ఈ సర్క్యులర్ పై, ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలపై ఏం మాట్లాడుతాడని జనం అందరూ బహిరంగంగా చర్చించుకుంటున్న విషయం ఇప్పుడు మనం చూస్తున్నాం. ఉస్మానియా సర్క్యులర్ కచ్చితంగా రాజ్యాంగ హక్కులను హరించే చర్య. మానవ హక్కులను హరించే చర్య. భావ ప్రకటన స్వేచ్ఛను హరించే చర్య. రేవంత్ ప్రభుత్వ ధోరణిని ఖండించలేక సమర్థించలేక సిపిఐ పార్టీ పాపం మల్లా గుల్లాలు పడుతోంది. ఒక ఎమ్మెల్యే సీటు ఒక ఎమ్మెల్సీ సీటు సాధించుకున్న పోరాట పార్టీ సిపిఐ రేవంత్ ప్రభుత్వ చర్యతో బిత్తర పోయింది. ఉస్మానియా యూనివర్సిటీ పోరాటాలకు పురిటి గడ్డ. ఉస్మానియా క్యాంపస్ ఎన్నో కొత్త కొత్త ఆలోచనలకు బీజం వేసినటువంటి స్థలం.

అటువంటి ఉస్మానియాలో మాట్లాడే స్వేచ్ఛను రద్దు చేసిన ఉస్మానియా యూనివర్సిటీ యాజమాన్యం, ఆ యూనివర్సిటీ ని నడిపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని విద్యార్థి యువకులు మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా నా వీర తెలంగాణమా నా పోరు తెలంగాణమా అని ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా గొంతెత్తి తెలంగాణ పోరాటానికి మద్దతు పలికిన గద్దర్ ఆశయాన్ని రేవంత్ సర్కార్ చాకచక్యంగా సమాధి చేసింది. అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపలేరు అని నినదించే పోరాట వీరుల ఆకాంక్షను ఉస్మానియా సర్క్యులర్ సవాల్ చేస్తున్నది.రేవంత్ రెడ్డి సర్కారు, ఈ సర్క్యులర్ తో ప్రజా గొంతును నొక్కి వేయగలదా ? పొడుస్తున్న పొద్దున్న నిలువరించ గలదా? అని మేధావి వర్గము తమలో తాము ప్రశ్నించుకుంటున్నారు. తమలో తాము రగిలిపోతున్నారు.ఉస్మానియా సర్క్యులర్ ఇప్పుడు కాంగ్రెస్ రాజ్యాంగ ప్రదర్శన డొల్లతనాన్ని లోకానికి చాటి చెప్పింది. పార్లమెంటు లోపల, పార్లమెంటు బయట చేతిలో ఒక చిన్న రాజ్యాంగ పుస్తకం పట్టుకొని జై సంవిధాన్ అని నినాదాలు ఇచ్చే రాహుల్ గాంధీ గాని, కాంగ్రెస్ నాయకులు గానీ ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక సర్క్యులర్ పై పెదవి విప్పాల్సిన బాధ్యత వారిదే. ఈ సర్క్యులర్ ను వెనక్కి తీసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదే. ఈ సర్క్యులర్ కు వ్యతిరేకంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం చుట్టూ పోలీసుల పహారా ఒక ఎమర్జెన్సీ వాతావరణన్ని జ్ఞాపకం చేసింది.ఉస్మానియా యూనివర్సిటీ సర్క్యులర్ ఇప్పుడు కమ్యూనిస్టుల కార్య పద్ధతి కి ఒక సవాలు విసిరింది.పోరాటాలను ఉద్యమాలను వదిలి ఇతర పార్టీలకు తోకలుగా మారిన కమ్యూనిస్టు సంఘాలు ఇకపై తమ సిద్ధాంత కార్యాచరణను ఏ రకంగా అమలు చేస్తారో, ఆచరిస్తారో అని తెలంగాణ ప్రజలతో పాటు, దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది. ఏదేమైనా, కాంగ్రెస్ మరియు కమ్యూనిస్టు పార్టీల మధ్య సంబంధాలను ఈ ఉస్మానియా సర్క్యులర్ నిర్ణయించబోతున్నది.తెలంగాణలో ఒక కొత్త రాజకీయ సమీకరణకు ఈ ఉస్మానియా సర్క్యులర్ కారణంగా మారబోతున్నది.

## అమ్దాపూర్ జడ్పీహెచ్ఎస్ ను సందర్శించిన సబ్ కలెక్టర్...

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును, రిజిస్టర్లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులను పిలిచి వారి సామర్థ్యాలను పరీక్షించారు. నిర్వహిస్తున్న ఎండ్ లైన్ పరీక్ష పేపర్లను పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, అరుణ, సత్యనారాయణ, విజయ లక్ష్మీ, రవికుమార్, రాము, సినిత, సీఆర్పీ శివానంద్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## హిందూ పుణ్యక్షేత్రాల యాత్ర పథకం తీసుకురావాలి

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

హజ్ యాత్ర తరహాలో ప్రతి నియోజకవర్గం నుంచి కనీసం 500 మంది భక్తులు చార్ ధామ్ (కేదార్ నాథ్, బద్రీనాథ్,గంగోత్రి, యమునోత్రి)కు వెళ్లేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు.అసెంబ్లీ సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు.ఇటీవల దాడులలో విగ్రహాలు ధ్వంసం అయిన ప్రతిగుడి పునః ప్రతిష్టాపనకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించేలా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ప్రత్యేకంగా తెలంగాణ టెంపుల్ డెవలప్ మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి ఆలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పారదర్శకంగా స్థానిక అభివృద్ధికి



వినియోగించాలని అన్నారు.తెలంగాణ రాక ముందు 87,235 ఎకరాల దేవాదాయ భూములు ఉండేవని,తెలంగాణ వచ్చిన తరువాత 20,124 ఎకరాల భూములు కబ్జాకు గురైతే కేవలం 1146 ఎకరాలకు మాత్రమే కేసులు నమోదయ్యాయని అన్నారు.కబ్జాకు గురైన మిగతా భూముల లెక్క ప్రభుత్వం దగ్గర ఉందా? ఉంటే ఏం చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. టూరిజం 2025%-%30 పాలసీలో రాష్ట్రంలోని ముఖ్యంగా 27 పర్యాటక ప్రాంతాలను గుర్తించారని,775 కోట్ల బడ్జెట్ తో అభివృద్ధి సాధ్యమా అని ప్రశ్నించారు.కేవలం ప్రాంతాల పేర్లు, స్థలాలు చెప్పారని,కానీ పాలసీ లో వాటిని ఏ రకంగా అభివృద్ధి చేస్తారో సరైన సమాధానం లేదన్నారు.ప్రభుత్వం పాలసీ లో పేర్కొన్న 27 ప్రాంతాలతో పాటు నిజామాబాద్ అర్బన్ లో ఉన్న ఖిల్లా రామాలయాన్ని కూడా అందులో చేర్చి అభివృద్ధి చేయాలని కోరారు.

## మందర్నా క్వారీ పై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు...

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**


బోధన్ డివిజన్ సాలూర మండలంలోని మందర్నా ఇసుక క్వారీపై టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇంచార్జి ఆడిషనల్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అంజయ్య, ఎస్ఐ గోవింద్, స్పెషల్ పార్టీ తో కలిసి సోమవారం అర్ధరాత్రి బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మందర్నా గ్రామ శివారు మంజీరా నదిలో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తోడుతున్న 3 జెసిబిలను, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 9 టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం 3జేసీబీలు, 9టిప్పర్లు,12మంది డ్రైవర్లను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అంజయ్య పేర్కొన్నారు.

## అనుమతులు లేని పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

**- డిఈవోకు ఫిర్యాదు చేసిన ఎఐఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల...**

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

నిజామాబాద్ నగరంలోని ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న 15 పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,అనుమతు లేకుండా నడుస్తున్న




పాఠశాలలపై మండల విద్యాశాఖ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని,అనుమతులు లేని స్కూల్లో లిస్టు డీఈఓ అందించడం జరిగిందన్నారు.అదేవిధంగా పదవ తరగతి పరీక్షలు కూడా ప్రారంభం అవ్వకముందు నుంచే అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభించి స్కూల్ లకు ఇబ్బందుల పాలు గురిచేస్తున్న ఈ కార్పొరేట్ ఆగడాలను అరికట్టాలని అన్నారు.అనుమతుల్లేని విద్యాసంస్థలు వల్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులు నష్టపోతున్నారని,తక్షణమే స్పందించి వాటిపై చర్యలు తీసుకోవాలని జ్వాల కోరారు.అదేవిధంగా జిల్లా విద్యాశాఖగా అనుమతులు లేని లిస్టు మొత్తం ఒకసారి పత్రిక ప్రకటన ఇస్తే బాగుంటుందని దీనివల్ల అనుమతి ఉన్న స్కూల్లో పర్మిషన్ లేని స్కూల్స్ ఏవో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన వస్తుందని ఆమె డిఇఓను కోరారు.

# రాష్ట్రస్థాయి కిట్స్ జోన్ 2025 పోటీల్లో మంథని జెఎన్టియు జట్టు ద్వితీయ స్థానం




**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్ 25.**
హుజురాబాద్ లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి కిట్సోజన్ 2025 పోటీల్లో మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాల బాలుర జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది.అలాగే షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలోను రెండవ బహుమతి కైవసం చేసుకున్నారు.విజేతలను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు.ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జరిగే టోర్నమెంట్లో గెలిచి కళాశాలకు పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పరిపాలనాధికారి సుమన్,ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి,సునీల్ కుమార్ తదితరులు పాల్గోన్నారు.

# ఐ ఎన్ టి యు సి ఎఫ్, కరీంనగర్ జిల్లా నూతన అధ్యక్షులుగా అంబాల శ్రీనివాస్ ఎన్నిక



- కార్మికుల సమస్యల పట్ల నా వంతు కృషి చేస్తా..
- నూతన కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అంబాల శ్రీనివాస్..

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి


भारतीय राष्ट्रीय मज़दूर काँग्रेस (महासंघ)
INDIAN NATIONAL TRADES UNION CONGRESS(FEDERATION)
(INTUC)
Reg.No.:F-10/DRTU/NE/01-2023
Swaminath Jaiswal Ji
National President INTUC
Dr. MURAHARI BUDDARAM
Telangana State President INTUC
Reff. No: INTUC/TS. P/0051/2024,
Date: 23/03/2024
Hyderabad
To,
Mr. AMBALA SRINIVAS,
H-NO: 1-16, BETHIGAL VILL,
VEENAVANKA MANDAL,
KARIM NAGAR Dist.,
Telangana State, INDIA - 505129.
Sub: APPOINTED as INTUC Dist. PRESIDENT for KARIM NAGAR Dist. in TELANGANA STATE. Dear AMBALA SRINIVAS,

తెలంగాణ రాష్ట ( ఐ ఎన్ టి యు సి ఎఫ్, )అధ్యక్షులు మురారి బుద్దరం, రాష్ట్ర ఉపాధ్యక్షులు జిర్లపెల్లి రాజు, హైదరాబాద్ కార్మిక సంఘం భవనంలో, కార్మిక సమావేశంలో కరీంనగర్ జిల్లా (ఐ ఎన్ టి యు సి,) అధ్యక్షులు గా హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక మండలం, బేతీగల్ గ్రామానికి చెందిన అంబాల శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా.. అంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ..నా నియామకానికి కృషి చేసిన కార్మిక సంఘం నాయకులకు మరియు వివిధ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నియామకం ద్వారా అసంగటిత కార్మికులు సంగటిత కార్మికుల సమస్యలను, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని, వారు అన్నారు.

# కృత్తిమా కాలు అందించిన ఆలయ ఫౌండేషన్

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిదిలో అంబేద్కర్ నగర్ చెందిన వడ్లూరి పోచయ్య అనే కార్మికుడు ప్రమాదవశాత్తు తన కుడికాలు కోల్పోయి ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత ను సంప్రదించగా ఆలయఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ అధికారి చొరవతో శ్రీ భగవాన్ మహవీర్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో తనకు జైపూర్ ఫుట్ ను అందించడం జరిగింది గత పది సంవత్సరాలుగా ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ వరంగల్ జిల్లాలో విద్యా వైద్యం ఉపాధి కార్యక్రమాలను చేస్తున్నాము మధ్యప్రదేశ్ రాష్ట్రంలో వుండి జన్మభూమి పై మమకారంతో సేవ చేయడం సంతోషంగా ఉంది ఆలయఫౌండేషన్ పరికిపండ్ల నరహరి ఐఏఎస్

# గద్దర్ గళం అవార్డ్స్ లకు దరఖాస్తులకు ఆహ్వానం

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ (వి.ఎస్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో గద్దర్ గళం అవార్డ్స్ లకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నామని సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్, లయన్ డాక్టర్, సురభి శ్రీధర్ తెలిపారు.విశ్వవసు నామ సం,,ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉభ య తెలుగు రాష్ట్రాలలోని కవులకు, రచయితలకు, గాయకులకు, కళాకారులకు గద్దర్ గళం అవార్డ్స్ తో పాటు పలు రంగాలలో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు, పండితులకు, సంగీత, సాహిత్య, నృత్య, చిత్రలేఖన, శిల్ప, జానపద, మిమిక్రీ, ఇంద్రజాల, హరికథ, బురక్రథ, ఒగ్గుకథ, కోలాటం విద్య, వైద్య రంగాలలో సేవలందిస్తున్న వారికి జాతీయస్థాయి మానవత వెలుగు అవార్డ్స్ - 2025 ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 15 లోపు ఈ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకునేవారు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8977748838 నెంబర్ ను సంప్రదించాలని సురభి శ్రీధర్ తెలిపారు.

# ఆర్జి 1లో 29 మందికి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వుల అందజేత

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



ఆర్జి 1 జియం కార్యాలయంలో మెడికల్ ఇన్ వాలిడేషన్, చనిపోయిన ఉద్యోగుల డిపెండెంట్స్ 29 మందిలో 27 మంది పురుషులు, ఇద్దరు మహిళలకు కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులు ఆర్జి 1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ చేతుల మీదుగా అందించారు. ఈ సంధర్భాన్ని పురస్కరించుకొని ఆర్జి 1 జనరల్ మేనేజర్ జియం లలిత్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి సి%ఎ%ఏం.డి ఎన్.బలరాం చొరవతో త్వరితగతిన కారుణ్య నియామక ఉత్తర్వులు అందించటం జరిగుతుందని అన్నారు. మెడికల్ బోర్డ్ కు దరఖాస్తు చేసున్న వారు వెంటనే ఆన్ ఫిట్ అవటం ఆ వెంటనే వారి కుటుంబ సభ్యులలో డిపెండెంట్ కింద పోస్టింగ్ అందించటం త్వరితగతిన అవుతుందని అన్నారు. వీరికి ఆర్జి 1 ఏరియాలో పోస్టింగ్ ఇవ్వటం జరుగుతుందన్నారు. అతి తక్కువ సమయంలో వీరికి పోస్టింగ్ ఇవ్వటం జరిగిందని అన్నారు. జాయిన్ కాబోవు ఉద్యోగులు ఇప్పటి పరిస్థితులకు అనుకూలంగా పని నైపుణ్యాన్ని మెరుగుపరచుకొని కంపెనీ పురోభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. సింగరేణి భవిష్యత్ యువ ఉద్యోగుల చేతులలో ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా పనియే ప్రత్యేక్ష దైవంగా భావించి తమ విధులకు హాజరు కావాలని, అదే విధంగా ఇట్టి ఉద్యోగ అవకాశం కల్పించిన తల్లి, తండ్రులను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జియం గోపాల్ సింగ్, డిజియం పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, సిఏంఒఏఐ అధ్యక్షులు బి.మల్లేష్, ఏఐటియుసి డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పిఓ హనుమంతరావు, సీనియర్ పిఒలు శ్రావణ్ కుమార్, హనుమంతరావు, నాయకులు రంగు శ్రీను, సంతోష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏడు రోజుల ముందుగానే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన ఆర్జీ-త్రీ ఏరియా

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రామగుండం-3 ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు గాను రామగుండం-3 ఏరియా అధికారులకు, ఉద్యోగులకు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అభినందనలు తెలియజేశారు.2024-25 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం రామగుండం-3 ఏరియా కు నిర్దేశించిన 62.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 100 శాతం అనగా 62.5003 లక్షల టన్నుల బొగ్గును ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి 7 రోజుల ముందుగానే ఉత్పత్తి చేసినందుకు సంబంధిత అధికారులకు,ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థకు అద్భుతమైన నాయకత్వం అందించడమే కాకుండా,క్షేత్ర స్థాయి పర్యటనలతో ఉద్యోగులందరిలో చైతన్యం కలిగిస్తూ,ప్రోత్సాహాన్ని నింపుతూ చక్కని మార్గదర్శకత్వం అందిస్తున్న సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ కు,ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్న డైరెక్టర్ (ఇ & ఎం) డి.సత్యనారాయణ రావు,డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ,డైరెక్టర్ (ప్లానింగ్,ప్రాజెక్ట్స్ అండ్ పా) కొప్పుల వెంకటేశ్వర్ల కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే సంస్థలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులకు,కార్మిక సంఘాల నాయకులకు,ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులకు,స్థానిక ప్రజా ప్రతినిధులకు, పరిసర ప్రాంతాల ప్రజలకు,కాంట్రాక్టర్లకు,కాంట్రాక్ట్ ఉద్యోగులకు,పాత్రికేయులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.అంతేకాకుండా ఈ లక్ష్య సాధనలో ఎప్పటికప్పుడూ తగిన సహాయ సహకారాలను అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగులందరూ భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సమిష్టి కృషితో,భద్రతతో సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

# అఘోరీతో బీటెక్ యువతి జంప్.. మరో లేడీ అఘోరీగా మారబోతుందా?



తెలుగు రాష్ట్రాల్లో లేడీ అఘోరీ గురించి తెలియని వారు ఉండరు. ఆ మధ్య ఆమె వరుసగా ఆలయాలకు వెళ్లి అక్కడ నానా హంగామా చేసింది. అయితే కొద్దిరోజులుగా ఆమె పెద్దగా కనిపించడం లేదు. అయితే తాజాగా గుంటూరు జిల్లా మంగళగిరిలో బిటెక్ చదువుతున్న విద్యార్థిని అఘోరీగా మారటానికి ఇంటిలో నుంచి వెళ్ళిపోవడం కలకలం రేపుతోంది. ప్రియదర్శిని కాలేజ్ లో బిటెక్ చదివిన విద్యార్థినికి కొన్ని రోజుల క్రితం మంగళగిరికి వచ్చిన లేడీ అఘోరీతో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత కొద్దీ రోజుల పాటు విద్యార్థిని ఇంట్లోనే అఘోరీ బస చేసింది. ఆ క్రమంలో అఘోరికీ, యువతికి మధ్య సాన్నిహిత్యం పెరిగింది.రెండు రోజుల క్రితం మేజర్ అయిన యువతి తాను అఘోరీగా మారటానికి హైదరాబాద్ వెలుతున్నట్లు పోలీసులకు చెప్పి వెళ్ళింది. తాను మేజర్‌ను అని, అయితే తన తల్లిదండ్రులకు తాను అఘోరీగా మారటం ఇష్టం లేదని దీంతో ఇల్లు విడిచి వెళ్ళిపోతున్నట్లు చెప్పింది.తండ్రి కోటయ్య పోలీసులను ఆశ్రయించాడు. తన కూతురు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే అంతకుముందే ఆ యువతి పోలీసులకు తాను వెళ్ళిపోతున్నట్లు చెప్పడంతో అదే విషయాన్ని పోలీసులు తల్లిదండ్రులుకు చెప్పారు. దీంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తమ కూతూరిని ఆఘోరి వశపరుచుకుందని ఆరోపించారు. అఘోరి చెర నుంచి తమ కూతురును విడిపించి తమకు అప్పగించాలని వేడుకుంటున్నారు.

# సంక్షేమాధికారులతో సమీక్షా సమావేశం

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



రామగుండం-3 ఏరియాలోని వివిధ గనులు, విభాగాల సంక్షేమాధికారులతో పాటు ఏరియా పర్సనల్ విభాగం అధికారులతో మంగళవారం జి.యం. కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు హాజరై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా ముందుగా గనుల సంక్షేమాధికారులు సంబంధిత గనులు, విభాగాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన టర్మినల్ బెనిఫిట్స్, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పన, పదోన్నతులు, క్రమశిక్షణాచర్యలు లాంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలు అందించారు. తదుపరి జి.యం. మాట్లాడుతూ సంక్షేమానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించిన వెంటనే తగినచర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పనలో జాప్యం కాకుండా చూడాలన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత ఉద్యోగులకు అమలు చేస్తున్న వైద్యసేవల పథకానికి సంబంధించి విశ్రాంత ఉద్యోగులకు అవగాహన కల్పించి దరఖాస్తులు అందజేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల సంక్షేమాధికారులు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. గ్రాట్యుటీ, సి.ఎం.పి.ఎఫ్. నామినేషన్ పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు అవగాహన కల్పించి హెచ్.డి.ఎఫ్.సి., పంజాబ్ నేషనల్ బ్యాంకులలో వారి వేతన ఖాతాలు తెరిచే విధంగా కృషి చేయాలని కోరారు. ఉద్యోగుల సర్వీసు విషయాలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుతం గనులు, విభాగాలలో టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పనలో పెండింగ్ లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకుంటున్న సంక్షేమాధికారులు, ఏరియా పర్సనల్ విభాగం అధికారులను జి.యం. ఈ సందర్భంగా ప్రశంసించారు.
ఈ సమావేశంలో గనుల ప్రాజెక్ట్ ఆఫీసర్లు సి.హెచ్.వెంకటరమణ, జె.రాజశేఖర్, మేనేజర్లు ఉదయ్ హరిజన్, కె.వి.రామారావు, పి.సుధాకర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ షబ్బీరుద్దీన్, అధికారులు గుర్రం శ్రీహరి, వి.సునీల్ ప్రసాద్, యం.డి.మతీన్ హుస్సేన్, పి.రాజేశం, బి.మురళి, సాయికృష్ణ , ప్రీతి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.